# సాక్షి
## కుమురం భీం
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023




**ఢిల్లీ మెచ్చిన పంచాయతీ** 10లో▸
ముఖరా(కె) పంచాయతీ ఓడీఎఫ్ ప్లస్‌గా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. మార్చి 4న రాష్ట్రపతి చేతుల మీదుగా సర్పంచ్ మీనాక్షి అవార్డు అందుకోనున్నారు.



**చిన్నారి పెళ్లి కూతుళ్లు..!**
సామాజిక కట్టుబాట్లు, పేదరికంతో చాలా మంది చిన్నారులు వివాహ బంధానికి బందీ అవుతున్నారు. ఏజెన్సీలో బాల్యవివాహాలు పెరుగుతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.2 /19.4

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఉంటుంది.

## న్యూస్‌రీల్

### 3న జెడ్పీ సర్వసభ్య సమావేశం

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని ఒడ్డెపల్లి ఫంక్షన్ హాల్‌లో మార్చి 3న ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో రత్నమాల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అలాగే ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

### ఉపాధ్యాయులకు సెమినార్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

**కాగజ్‌నగర్‌టౌన్:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు కాగజ్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల(సర్‌సిల్క్)లో కైనమెటిక్స్ అనే అంశంపై విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెరగాలంటే విద్యాబోధనలో ప్రయోగం, ప్రాజెక్ట్ పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం బోధనలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, కాగజ్‌నగర్ మండల విద్యాధికారి భిక్షపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అనుబంధ రంగాలపై ఆసక్తి చూపాలి



మాట్లాడుతున్న రాజేశ్వర్‌నాయక్

**రెబ్బెన(ఆసిఫాబాద్):** ఉపాధిహామీ కూలీలు వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆసక్తి చూపాలని కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు ఉన్నతి శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలు కష్టపడేతత్వాన్ని కలిగి ఉన్నారని, అలాంటి వారు వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన పెంచుకుంటే ఆర్థికంగా మరింత పురోగతి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో యువతకు గల అవకాశాలను వివరించారు. సంప్రదాయ పంటలు కాకుండా కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ వంటి వాటి సాగుపై దృష్టి సారించాలన్నారు. పట్టు పరిశ్రమ, తేనెటీగల పెంపకంతో లాభాలు గడించే అవకాశం ఉందన్నారు. మహిళలు తక్కువ పెట్టుబడితో ఎలా ఉపాధి పొందవచ్చనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త శివకృష్ణ కోట, వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ విధ్వంసం!



కెరమెరి రేంజ్‌లో నరికిన టేకు చెట్లు

- ఆగని కలప స్మగ్లర్ల దందా
- అటవీశాఖలో 'ఇంటి దొంగల' తీరుతో తీవ్ర నష్టం
- సిబ్బందిపై చర్యలకు మీనమేషాలు
- పట్టుపడుతున్న కలప ఎక్కడిదనే దానిపై స్పష్టత కరువు

**సాక్షి, ఆసిఫాబాద్:** అడవుల ఖిల్లాలో కలప స్మగ్లర్లు పాగా వేసి అటవీ విధ్వంసానికి పాల్పడుతున్నారు. కలప స్మగ్లర్ల వేటుకు చెట్లు నేలకొరుగుతుండడంతో పచ్చదనమంతా కరిగిపోతోంది. ఇటీవల జిల్లాలో తరచూ అక్రమంగా స్మగ్లర్లు తరలిస్తున్న కలపను అటవీ అధికారులు పట్టుకుంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఒకప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడవులు ఉండేవి అని చెప్పుకోవాల్సి వస్తోంది. కలప అక్రమ రవాణా వ్యవహారంలో అటవీశాఖ ఉన్నతాధికారులు ఇంటిదొంగలను పట్టించుకోకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

**అప్పుడప్పుడు కేసులు..**

కలప పట్టుకున్నాం.. లారీల్లో కలప ఉందని, పండ్ల మాటన దుంగలు తరలిస్తున్నారని, ఇసుక ట్రాక్టర్లలో వెళ్తోందని.. ఇలా రకరకాలుగా తరలుతున్న కలపను పట్టుకున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతుంటారు. అయితే ఈ కలప ఎక్కడి నుంచి వస్తోంది. ఏ రేంజీ పరిధిలోనిది? ఏ బీట్ పరిధిలోనిది? కలప తరలుతుంటే ఆ సిబ్బంది ఏం చేస్తున్నారు? స్మగ్లర్లకు సహకరిస్తున్నారా? పనితీరు ఎలాగుంది? అనే అంశంపై మాత్రం దర్యాప్తు జరగడం లేదు. పరోక్షంగా అటవీశాఖ ఉన్నతాధికారులు కూడా కలప అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని ఓ రేంజ్ పరిధిలోంచి వస్తున్న కలప ఆసిఫాబాద్‌లో పట్టుబడింది. అంటే దీనర్థం సదరు రేంజ్‌లోని సిబ్బంది పనితీరు సక్రమంగా లేదనే. ఇలా పట్టుబడిన కలప ఏదైనా ఒకచోట నుంచే వచ్చేదే. అడవి రక్షణ కోసమే ఉద్యోగులను నియమిస్తే వారి పట్టింపు లేనితనంతో యథేచ్ఛగా స్మగ్లింగ్ జరుగుతోంది. అయినా సిబ్బందిపై చర్యలు ఉండటం లేదు. చాలాచోట్ల అటవీ ఉద్యోగులు స్మగ్లర్లతో మిలాఖత్ అయ్యారనే ఆరోపణలున్నాయి. దీంతో తమ పరిధిలోని అడవుల్లో చెట్లు నేలకొరుగుతూ బయటకు పోతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రత్యేక అటవీశాఖ చెక్‌పోస్టులున్నా ఫలితం ఉండటం లేదు. జిల్లాలో కలప స్మగ్లింగ్ మూడు దుంగలు, ఆరు వాహనాలుగా సాగుతోందనే ప్రచారం ఉంది. లోతుగా దర్యాప్తు చేయిస్తే ఇంటిదొంగలు పట్టుబడే అవకాశం ఉంది.



మానిక్‌గూడ వద్ద పట్టుకున్న కలప వాహనంతో అధికారులు (ఫైల్)

**కలప అక్రమ రవాణా ఇలా..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 7.16 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోఅటవీ ప్రాంతం విస్తరించి ఉంది. కుమురంభీం జిల్లాలో చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), తిర్యాణి, కెరమెరి, వాంకిడి, ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్ గ్రామీణం, నిర్మల్ జిల్లాలోని కడెం, ఖానాపూర్, మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు, వేమనపల్లి, నెన్నెల ప్రాంతాల్లో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ముఖ్యంగా తిర్యాణి మండలంలో లొద్దిగూడ, గుండాల, మంగీ అటవీ ప్రాంతం నుంచి కలప భీంపూర్, చెలమెల మార్గం గుండా ఎదులపాడ్ నుంచి మంచిర్యాల జిల్లా కాసిపేట, దేవాపూర్, కరీంనగర్, హైదరాబాద్‌కు తరలుతోంది. మంగీ ప్రాంతం నుంచి మంచిర్యాల జిల్లా దండేపల్లి వరకు గుట్టలపై నుంచి సైకిళ్లపై తీసుకెళ్తున్నారు. పంగిడిమాదర, డోర్లి మీదుగా గోలేటి వైపు, వాంకిడి మండలంలో సవ్వాతి, దాబా, సర్కేపల్లి ప్రాంతాల్లో సైతం కలప అక్రమ రవాణా జరుగుతోంది. కెరమెరి, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో కలపను ఆసిఫాబాద్ సామిల్లకు గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కెరమెరి మండలంలోని స్వాంగి, సాకెడా ఏజెన్సీ గ్రామాల్లో నిత్యం చెట్ల నరికివేత సాగుతోంది. ఆదివారం అటవీశాఖ అధికారులకు పట్టుకున్న కలప అక్కడి నుంచే తరలించినట్లు తెలుస్తోంది. కలప అక్రమ రవాణా విషయమై ఆసిఫాబాద్ ఎఫ్ఆర్ఓ అప్పలకొండను 'సాక్షి' సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి



చెక్కు విడుదల చేస్తున్న మంత్రి ఐకే రెడ్డి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యేలు కోనప్ప, సక్కు

- దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- తునికాకు సేకరణ కూలీలకు రాయల్టీ చెక్కులు పంపిణీ

**చింతలమానెపల్లి/దహెగాం:** పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. చింతలమానెపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కుతో కలిసి తునికాకు సేకరణ కూలీలకు రాయల్టీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో 2016 నుంచి 2021 వరకు పెండింగ్‌లో ఉన్న రూ.27 కోట్ల తునికాకు రాయల్టీని 51,398 మంది కూలీలకు అందజేశామని తెలిపారు. చింతలమానెపల్లి మండలం గంగాపూర్ సమీపంలో టైగర్ జోన్ కారణంగా కొన్ని యూనిట్లలో తునికాకు సేకరణ నిర్వహించడం లేదని, అధికారులు తునికాకు సేకరణకు అనుమతివ్వాలని ఆదేశించారు. వచ్చే నెలలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటిస్తారని, కొత్త మండలమైన చింతలమానెపల్లి సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలు ప్రకటిస్తారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోనప్ప నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల సంక్షేమ కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

**పర్యావరణాన్ని కాపాడుకోవాలి**

అనంతరం దహెగాం మండలం లగ్గాం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలకు చెందిన తునికాకు కూలీలకు రాయల్టీ చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ తునికాకు కట్ట ధరను రూ.3లకు పెంచుతున్నామని తెలిపారు. మరో నెల రోజుల్లో పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం కూడా ప్రారంభమవుతుందని తెలిపారు. పెంచికల్‌పేట్ నుంచి లగ్గాం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.19 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.10వేలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రైతులకు 24 గంటలు కరెంటు ఇస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అదనపు ఎస్పీ (ఏఆర్) భీంరావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్, సీసీఎఫ్ వినోద్ కుమార్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, తహసీల్దార్ మష్కూర్ అలీ, ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీలు తాళ్లపల్లి రామారావు, శ్రీదేవి, ఎఫ్ఆర్‌వోలు అప్పలకొండ వేణుగోపాల్, నాయకులు సంతోష్‌గౌడ్, యాదగిరి బ్రహ్మయ్య యాదవ్, చునార్కర్ ఉమాజీ, అఖిల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎకో బ్రిడ్జి, జింకల పార్కు ఏర్పాటు స్థలం పరిశీలన



ఫారెస్ట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్

**సిర్పూర్(టి):** సిర్పూర్(టి), కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని పెద్దబండ సమీపంలో గల అటవీప్రాంతంలో ఉన్న భీమన్న ఆలయ సమీపంలో ఎకో బ్రిడ్జి, జింకల పార్కు ఏర్పాటు స్థలాన్ని రాష్ట్ర మంత్రి ఐకే రెడ్డి పరిశీలించారు. ఫారెస్ట్ మ్యాపును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు మినీ ట్యాంకుబండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాగమ్మ చెరువులో బుద్ధుడి విగ్రహం ఏర్పాటుతోపాటు అభివృద్ధి పనులు, పర్యాటక కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోనప్ప మంత్రిని కోరారు. నిధుల మంజూరు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్

**కాగజ్‌నగర్‌టౌన్:** జిల్లాలోని కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడేందుకు 'సాక్షి' ఈ నెల 28న ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. పట్టణంలోని ప్రజలు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి, వార్డుల్లో నెలకొన్న వీధి కుక్కలు, కోతుల బెడద, పారిశుధ్యం, వీధి దీపాలు పనిచేయకపోవడం, తాగునీటి సరఫరా లో అంతరాయం తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరవచ్చు.

సాక్షి ఫోన్ ఇన్

నేడు
కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కమిషనర్ : ఎస్.అంజయ్య



సంప్రదించాల్సిన నంబర్ : 63006 88040

సమయం : మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

# ప్రీతి మృతికి కారకులైన వారిని శిక్షించాలి

**ఆసిఫాబాద్‌అర్బన్:** వైద్య విద్యార్థిని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రీతి మృతికి సంతాపంగా జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, సత్వరమే శిక్షలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి చిరంజీవి, పోల్కర్ సాయిరాం, సంజీవ్, కోట వెంకన్న, సతీశ్‌బాబు, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు

**సైఫ్‌ను ఉరితీయాలి**

**ఆసిఫాబాద్‌అర్బన్:** ప్రీతి మరణానికి కారకుడైన సైఫ్‌ను వెంటనే ఉరి తీయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలనికోరారు.

# బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు

- అదనపు కలెక్టర్ రాజేశం

**ఆసిఫాబాద్:** జిల్లాలో బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బాల్యవివాహాల నియంత్రణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా ప్రతీ అధికారి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, డీసీపీవో మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో అదనపు కలెక్టర్ రాజేశం అర్జీలు స్వీకరించారు. జిల్లాలో 30 మంది విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. వాంకిడి మండలం బోర్ద శివారులోని పట్టా భూమికి 1936 నుంచి ఇప్పటివరకు సేత్వార్ పహాణి నకలు ఇప్పించాలని కాగజ్‌నగర్ మండలం నవేగాంకు చెందిన సిడాం వసంత్‌రావు దరఖాస్తు చేసుకున్నాడు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణం మంజూరు చేయాలని కౌటాల మండలం తుమ్మిడిహెట్టికి చెందిన కలగూర శైలజ అర్జీ సమర్పించింది. రెబ్బెన మండలం కొండపెల్లి సర్పంచ్ శాంతి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని వాంకిడి మండలం సవాతికి చెందిన మత్తుబాయి విన్నవించింది.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

# 'ఆయిల్‌పామ్'కు అడుగు పడింది

- తొలి ఏడాదే 330 ఎకరాల్లో సాగుకు ముందుకొచ్చిన రైతులు
- అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- కలిసి వస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహం
- వచ్చే వానాకాలంలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం



పులికుంట శివారులో సాగవుతున్న ఆయిల్ పామ్

**రెబ్బెన(ఆసిఫాబాద్):** ఇప్పటివరకు సంప్రదాయ పంటల సాగుకే పరిమితమైన జిల్లా రైతులు మొదటిసారి ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేశారు. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ముందుకు రాకపోయినా వానాకాలం సీజన్‌లో పలువురు రైతులు మొక్కలు నాటుకున్నారు. ఆలస్యంగా సాగు లక్ష్యాన్ని నిర్ణయించడం, అప్పటికే ఇతర పంటల సాగు చేపట్టడంతో ఉద్యానవన శాఖ అధికారులు లక్ష్యాన్ని సాధించలేకపోయారు. రానున్న వానాకాలంలో లక్ష్యానికి మించి సాగవుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో సాగు వివరాలు**

| మండలం | నాటిన మొక్కలు | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|
| దహెగాం | 3,864 | 67.8 |
| కాగజ్‌నగర్ | 3,943 | 69.2 |
| పెంచికల్‌పేట్ | 1,907 | 33.5 |
| రెబ్బెన | 3,340 | 58.6 |
| సిర్పూర్(టి) | 940 | 16.5 |
| కౌటాల | 819 | 14.4 |
| బెజ్జూర్ | 313 | 5.5 |
| ఆసిఫాబాద్ | 2,008 | 35.2 |
| జైనూర్ | 1,539 | 27.0 |
| చింతలమానెపల్లి | 114 | 2.0 |


**1,048 ఎకరాల లక్ష్యం**

రాష్ట్రంలో గతేడాది వరకు కేవలం తొమ్మిది జిల్లాలకే పరిమితమైన ఆయిల్‌పామ్ సాగు వర్షాకాలంలో అన్ని జిల్లాల్లోనూ మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కుమురంభీం జిల్లా రైతులు సైతం ఆయిల్‌పామ్ వైపు అడుగులు వేశారు. ఇప్పటివరకు ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తికే అధిక ప్రాధాన్యత ఇస్తూ వన్నారు. అన్ని మండలాల్లోని భూములు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉండటం రైతులకు కలిసరానుంది. వ్యవసాయ రంగంలో వెనుకబడిన జిల్లా రైతులను లాభాలు సాధించేలా ఉద్యానవన శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఆయిల్‌పాంతోపాటు ఇతర ఉద్యావన పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ చైతన్యపరుస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తుండటంతో జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గత ఆగస్టులో 2022- 23 సంవత్సరంలో జిల్లాలో 1,048 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇప్పటివరకు 330 ఎకరాల్లో మొక్కలు నాటారు. ఆగస్టులో లక్ష్యాన్ని నిర్ణయించడంతో అప్పటికే వానాకాలం సీజన్ ప్రారంభమై రైతులు ఇతర పంటలు వేసుకున్నారు. ప్రస్తుతం పత్తితీత పనులు పూర్తికాగా, ఇప్పుడిప్పుడే ఆయిల్‌పామ్ సాగు పుంజుకుంటోంది. అయితే చాలా మంది రైతులు పత్తికి ధర లేకపోవటంతో దిగుబడిని అంతా ఇళ్లలో నిల్వ ఉంచారు. డ్రిప్ కోసం డీడీ కట్టేందుకు చేతిలో డబ్బులు లేక ఆయిల్‌పామ్‌ను సాగు ప్రారంభించడం లేదని తెలుస్తోంది.

**సాగుకు ప్రభుత్వ 'ప్రోత్సాహం'**

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని భారీగా పెంచేందుకు ప్రభుత్వం ఈ పంట సాగుకు రైతులకు ప్రోత్సహిస్తోంది. మొక్క నాటిన మూడో సంవత్సరం నుంచి పంట దిగుబడి ప్రారంభమవుతుంది. ఒక్కసారి నాటితే దాదాపు 30 ఏళ్ల వరకు దిగుబడి ఉంటుంది. మొదటి నాలుగేళ్లు అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ నాలుగేళ్లు ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సాహం అందజేస్తోంది. అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.2,100, ఆయిల్‌పామ్ మొక్కల సంరక్షణకు ఎకరానికి రూ.2,100 చొప్పున ప్రోత్సాహం అందజేస్తోంది. ఎకరం విస్తీర్ణంలో 57 మొక్కలు నాటాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక్కో మొక్క ఖరీదు సుమారు రూ.190 ఉంటుంది. ప్రభుత్వం రైతులకు రూ.20లకే అందిస్తోంది. సబ్సిడీపై డ్రిప్ సిస్టం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు పూర్తిగా 100శాతం సబ్సిడీ ఉండగా, బీసీ రైతులకు 90శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ ఉంటుంది.

### అధిక వర్షాలతో ఆలస్యం



జిల్లాలో ఈ సంవత్సరమే మొదటి సారి ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించాం. ఆగస్టులో లక్ష్యం నిర్ణయించడంతో అప్పటికే రైతులు ఇతర పంటలు వేసుకున్నారు. అధిక వర్షాలతో పత్తి సాగు పనులు కూడా రెండు నెలలు ఆలస్యం అయ్యాయి. దీంతో పూర్తి లక్ష్యాన్ని సాధించలేకపోయాం. జిల్లాలో 330 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించాం. మార్చిలో వచ్చే ఏడాదికి సంబంధించిన లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈసారి ముందస్తుగానే కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– ఎంఏ నదీమ్, జిల్లా ఉద్యానవన అధికారి

## క్లుప్తంగా

### చైర్ కార్ మ్యాన్‌రైడింగ్ సిస్టం పరిశీలన


పరిశీలిస్తున్న డీడీఎంఎస్ అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే 7 గనిలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన చైర్ కార్ మ్యాన్‌రైడింగ్ సిస్టంను డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీడీఎంఎస్) అధికారులు సోమవారం పరిశీలించారు. గతంలో బ్రేకింగ్ సిస్టంలో సాంకేతిక లోపాలు రావడంతో డీడీఎంఎస్ ఆదేశాలతో ఆర్నెళ్లుగా యంత్రాన్ని నిలిపివేశారు. ఇటీవలే దానికి మరమ్మతు చేయడంతో డీడీఎంఎస్ అధికారులు వచ్చి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, గ్రూప్ ఇంజినీర్ రాజా రవిచరణ్, పిట్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సార్పీ 3లో లేఆఫ్ కొనసాగింపు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3 గనిలో సోమవారం కూడా లే ఆఫ్ కొనసాగింది. గురువారం గనిలో గ్యాస్ రావడంతో అధికారులు ఆ స్థలాన్ని మూసివేసి లే ఆఫ్ ప్రకటించారు. సోమవారం ఉదయం గ్యాస్ శాంపిల్స్ సేకరించిన కంపెనీ అధికారులు గ్యాస్ పూర్తిగా కంట్రోల్ అయ్యిందని నిర్ధారణకు వచ్చారు. అయితే మరోరోజు వరకు అబ్జర్వేషన్‌లో ఉంచడం కోసం డీడీఎంఎస్ అధికారి లే ఆఫ్ ఉంచాలని ఆదేశించారు. మంగళవారం పరిస్థితిని సమీక్షించి నిర్ణయం తీసుకోనున్నారు.

### సౌత్ ఇండియా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా సోమశేఖర్


సోమశేఖర్‌ను అభినందిస్తున్న జయరాం పల్సనియా

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలంలోని నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్‌కు అరుదైన గౌరవం దక్కింది. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సర్పంచుల సంఘం సమావేశంలో సోమశేఖర్‌ను సౌత్ ఇండియా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జాతీయ అధ్యక్షుడు జయరాం పల్సనియా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ సౌత్ ఇండియాలో ఉన్న తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు.

# ‘డబుల్’ మిస్టేక్!


మున్సిపల్ కార్యాలయంలో జాబితాలో పేర్లు చూసుకుంటున్న దరఖాస్తుదారులు

- అర్హతలున్నా జాబితా నుంచి తొలగింపు
- లిస్టులో అనర్హుల పేర్లు
- మూడు రోజుల్లో 184 అభ్యంతరాలు స్వీకరణ


అనర్హులుగా పేర్కొన్న వారి నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

మంచిర్యాలటౌన్: డబుల్ బెడ్‌రూం ఇల్లు పొందేందుకు తమకు అన్ని అర్హతలు ఉన్నా అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి పేర్లు తొలగించారని ఇల్లు లేని నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇల్లులేని నిరుపేదలు 2,958 మంది ప్రభుత్వం అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి పరిశీలించిన రెవెన్యూ అధికారులు అందులో 1,548 మందిని అర్హులుగా, 1,410 మందిని అనర్హులుగా గుర్తించారు. ఇటీవల అర్హులు, అనర్హుల జాబితాల వివరాలను మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రదర్శించారు. తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్‌లో దరఖస్తు చేసుకున్న వారిని జాబితాలో చేర్చకుండా, కేవలం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారినే అధికారులు పరిగణలోకి తీసుకున్నారు. వీటిపై ఈ నెల 25, 26, 27 తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో అభ్యంతరాలను స్వీకరించగా 184 మంది అర్హులైనా తమపేర్లను ఎలా తొలగించారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ఒక్కో ఇంటికి రూ.లక్ష!**

మంచిర్యాల మున్సిపాలిటీలో 650 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. ఆయా ఇళ్ల నిర్మాణం కోసం భూములను కోల్పోయిన 30 కుటుంబాలకు గతంలోనే ఇళ్లను పంపిణీ చేశారు. మిగిలిన 620 ఇళ్లకుగానూ 330 పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండి లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో కొంత మంది దళారులు, ప్రజాప్రతినిధులు ఇళ్లు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వని వారి పేర్లను అనర్హుల జాబితాలో చేర్చారని, అన్ని అర్హతలు ఉన్నా తమను ఎలా తొలగిస్తారని దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు. అర్హుల జాబితాలో చేర్చాలని కోరుతున్నారు.

### అద్దె ఇంట్లో ఉంటున్నా..



నేను ట్రాన్స్‌జెండర్‌ని. నాకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నా. 2021 మే 5 న మీసేవలో దరఖాస్తు చేసుకున్నా. వివరాలు సేకరించిన అధికారులు నేను అర్హురాలినని రాసుకుని వెళ్లారు. కానీ అనర్హుల జాబితాలో నాపేరు చేర్చారు. అధికారులను అడిగితే సమాధానం ఇవ్వడం లేదు. – జంగపల్లి అంజలి, హమాలివాడ

# ‘మిస్టర్ తెలంగాణ’ శివశంకర్


మిస్టర్ తెలంగాణ విజేత శివశంకర్‌కు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు


మిస్టర్ ఆదిలాబాద్ విజేత అన్వర్

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు ముగిసాయి. బెల్లంపల్లి స్మైక్ జిమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీలు సోమవారం తెల్లవారుజాము వరకు సాగాయి. దేహదారుఢ్య ప్రదర్శనతో హైదరాబాద్‌కు చెందిన శివశంకర్ మిస్టర్ తెలంగాణ ఐరన్ మెన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. బహుమతిగా రూ.50వేల నగదు అందుకున్నాడు. మిస్టర్ ఆదిలాబాద్ టైటిల్‌ను ఎస్‌కే.అన్వర్(మంచిర్యాల) సాధించగా, రూ.15వేల నగదు బహుమతి అందుకున్నాడు. మిస్టర్ జూనియర్ తెలంగాణ టైటిల్‌ను వి.విశాల్‌కుమార్(హైదరాబాద్) సొంతం చేసుకున్నాడు. బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 120 మంది పాల్గొన్నారు. దివ్యాంగులు కూడా పోటీల్లో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అంతకుముందు దాతలు, మాజీ బాడీ బిల్డర్లను నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ పంతాటి సదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి హరీష్‌సింగ్, తాండూర్ సీఐ జగదీష్, జిల్లా బాడీ బిల్డింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు తోట తిరుపతి, కార్యదర్శి రాకేష్, బెల్లంపల్లి కార్యదర్శి పన్నాల సదానందం, మిస్టర్ ఇండియా టైటిల్ హోల్డర్లు పి.రాజు, సంతోష్‌కుమార్, మిస్టర్ కోలిండియా జె.నాగమల్లేశ్వర్‌రావు, ఓరం సురేష్, జాతీయ బాడీ బిల్డింగ్ జడ్జీలు ఎసప్ప, రంజన్‌రెడ్డి, మహ్మద్ ఇంతియాజ్, బెల్లంపల్లి స్మైక్‌జిమ్ నిర్వాహకులు ఎస్.బాలకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### యువకుడిపై పోక్సో కేసు నమోదు

తాండూర్(బెల్లంపల్లి): బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సమ్మయ్య తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలికను తంగళ్లపల్లి గ్రామానికి చెందిన రజనీకాంత్ అనే యువకుడు తనను ప్రేమించాలని వేధింపులకు గురిచేశాడు. బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పడంతో ఆదివారం రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఉరేసుకుని కార్మికుడు ఆత్మహత్య


పోశం మృతదేహం

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటేశ్వర్ రావుపల్లెకు చెందిన చిలుముల పోశం(61)అనే సింగరేణి కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఫరీద్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్పీ 3 గనిలో విధులు నిర్వర్తిస్తున్న పోశం కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తరచూ విధులకు గైర్హాజర్ అవుతుండడంతో సంస్థ యాజమాన్యం ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసింది. కోర్టు ద్వారా తిరిగి ఉద్యోగం పొందినా మద్యం సేవించడం మాత్రం మానలేదు. అంతేకాకుండా తన ఇద్దరు కుమారులు ఏ పనిచేయకుండా ఖాళీగా ఉంటుండడంతో తాను చనిపోతేనైనా ఒకరికి తన ఉద్యోగం వస్తుందని తరచూ కుటుంబ సభ్యులతో చెప్పేవాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని ఎస్సై పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఇసుక డంపులు సీజ్

జైపూర్: మండలంలోని రసూల్‌పల్లి పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించి ఆయా ప్రాంతాల్లో నిల్వచేసిన 150 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఇసుక విలువ సుమారు రూ.లక్ష 50 వేలు ఉంటుందన్నారు. కట్కూరి సత్యనారాయణకు చెందిన 10 ట్రిప్పులు, అంబల్ల సంపత్‌రెడ్డికి చెందిన 130 ట్రిప్పులు, లింగస్వామికి చెందిన 10 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసి తదుపరి చర్యలకు రెవెన్యూశాఖ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

### జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ఎస్సై శ్వేత

చెన్నూర్: బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి టీసీఓఎస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చెన్నూర్ ఎస్‌జీవో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ రామగిరి స్వామి తెలిపారు. ఆర్.సృజన్ బంగారు, దాదా శరణ్య, సనాతణిని వెండి పతకాలు గెల్చుకున్నారు. విజేతలను ఎస్సై శ్వేత, పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌రెడ్డి అభినందించారు.

### పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

పాతమంచిర్యాల: ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన క్రీడాప్రాంగణాలు, బృహత్ ప్రకృతి వనాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములను పరిశీలించి నివేదికలు అందించాలన్నారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియ వందశాతం పూర్తయ్యేలా తహసీల్దార్లు కార్యాచరణ రూపొందించాలన్నారు.

# కార్మిక సమస్యలపై ఉద్యమ కార్యాచరణ

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టామని ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో ఢిల్లీలో జరిగిన యూనియన్ 33వ ప్లీనరీలో దేశ వ్యాప్తంగా 10 జాతీయ సంఘాలను కలుపుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేయడానికి తీర్మానం చేశామన్నారు. కార్మిక చట్టాలు సవరణ చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. బీఐఎఫ్ఆర్ స్థానంలో తీసుకువచ్చిన లా ట్రిబునల్ ఎత్తివేసి పాత విధానమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు, సెంట్రల్ ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, నాయకులు సీహెచ్ భీంరావు, కృష్ణమూర్తి, భీంరావు పాల్గొన్నారు.

**జాతీయ కౌన్సిల్‌కు ఎన్నిక**

ఐఎన్టీయూసీ జాతీయ కార్యవర్గంలో సింగరేణి నుంచి జనక్‌ప్రసాద్‌తో పాటు కౌన్సిల్ సభ్యులుగా కేనర్సింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, రాజమౌళి, జే శంకర్‌రావుకు స్థానం కల్పించినట్లు నేతలు తెలిపారు.

# అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 36 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కనక భీంరావ్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. పీవీటీజీ అధికారి బాస్కర్, డీపీవో ప్రవీణ్, ఓఎస్డీ క్రిష్టయ్య, ఏవో రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- తన కుటుంబ పోషణ, స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా ఆర్థిక చేయుత అందించాలని గుడిహత్నూర్ మండలం మచ్చాపూర్‌కు చెందిన నైతం లింబాజీ అర్జీ పెట్టుకున్నాడు.
- గిరి వికాసం పథకం ద్వారా బోరుబావి, విద్యుత్ మోటారు మంజూరు చేయాలని లింగాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన సురేశ్ విన్నవించాడు.
- తన పంట సాగు కోసం ఎడ్ల జత అందించాలని గుడిహత్నూర్ మండలం తోషంకు చెందిన అనసూయబాయి వేడుకుంది.
- తనకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సిర్పూర్(యూ) మండల కేంద్రానికి చెందిన లింబానాయక్ అర్జీ పెట్టుకున్నాడు.
- పోడుభూములకు అటవీ హక్కు పత్రం అందించాలని కెరమెరి మండలం బాబేఝరికి చెందిన కనక తుకారాం వేడుకున్నాడు.
- తాను బీఎడ్, టెట్ పూర్తి చేశానని, ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా ఉద్యోగ అవకాశం కల్పించాలని గాదిగూడ మండలం ఊట్లకు చెందిన రాథోడ్ స్వప్న విన్నవించింది.

# అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు

- బైక్ పైనుంచి పడి యువకుడు మృతి


తరుణ్ (ఫైల్)

జన్నారం(ఖానాపూర్): తన స్నేహితుని సోదరుడి అంత్యక్రియలకోసమని స్వగ్రామానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్, స్వప్న దంపతుల కుమారుడు దాసరి తరుణ్ (20) డిగ్రీ పూర్తి చేశాడు. చింతగూడకు చెందిన అతని స్నేహితుడు ధనుష్‌తో కలిసి హైదరాబాద్‌లో ఆర్మీ శిక్షణ తీసుకుంటున్నాడు. ధనుష్ సోదరుడు హర్ష ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకుని చింతలపల్లికి వచ్చాడు. ఆదివారం అంత్యక్రియల్లో పాల్గొన్న తరుణ్ ఇంటికి వచ్చాడు. సాయంత్రం బైక్‌పై చింతగూడకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగివస్తుండగా బొమ్మెన సమీపంలో బైక్ అదుపుతప్పి బండను ఢీకొట్టింది. ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఇరాక్ వెళ్లడంతో అంత్యక్రియలకు హాజరుకాలేకపోయాడు. దీంతో తల్లి స్వప్న కుమారుడి చితికి నిప్పంటించింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తానాజీ నాయక్ తెలిపారు.

# రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య


మాట్లాడుతున్న ఆశయ్య

పాతమంచిర్యాల: కుల వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రజకులను ప్రభుత్వం ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైల్ల ఆశయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తాపీమేస్త్రీ సంఘ భవనంలో సోమవారం సంఘం జిల్లా మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సంక్షేమం కోసం ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, 50ఏళ్లు నిండిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని, రజకుల సామాజిక భద్రతకోసం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రజక వృత్తిదారుల కోసం మోడరన్ దోభీఘాట్ల నిర్మాణం చేపడతామన్నారు. ఈ సందర్భంగా రజకుల సమస్యల పరిష్కారం కోసం 9 తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ద్యావనపల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పైరాల రాములు, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంగెపు హన్మంతు, ముష్కర చందు, కొత్తకొండ పోచం, కంచర్ల రాజమల్లు, దుర్శెట్టి రాములు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పథకాలు


బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతోందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, కలెక్టర్ బాదావత్ సంతోశ్ అన్నారు. హాజీపూర్ మండలంలోని గడ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గ్రామ పంచాయతీల్లోని బాబానగర్, నాగారం, పెద్దగోపాల్ గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు సీఎం గిరి వికాస్ పథకంలో భాగంగా ట్రైకార్ ఐటీడీఏ ఫండ్ కింద మంజూరైన బోర్‌వెల్ ఏర్పాటు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లోని బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు పొలాల వద్ద బోర్‌వెల్‌లను ఏర్పాటు చేయిస్తుందన్నారు. రూ.4,65,765లతో 7 బోర్‌వెల్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రూ.30,65,765లతో మోటార్లు, విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటి కింద మొత్తం 50 ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. మిషన్ కాకతీయ పథకం కింద గ్రామ చెరువును కూడా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్, శిక్షణ కలెక్టర్ గౌతమి, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ కొట్నాక అనూభాయి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

రెబ్బెన: ఉపాధి హామీ కూలీపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం గోలేటి విలేజ్ బస్టాండ్ వద్ద కూలీలు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. కూలీలకు మద్దతుగా బీజేపీ, సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై భూమేశ్ సంఘటన స్థలానికి వెళ్లి కూలీలతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆత్మారాం నాయక్, మాజీ జెడ్పీటీసీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### ట్రెయినీ కార్మికుడికి అస్వస్థత

బెల్లంపల్లి: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో ఓ ట్రెయినీ కార్మికుడు సోమవారం అస్వస్థతకు గురయ్యాడు. గనిలో శిక్షణ తీసుకుంటున్న ఆయిల్ల సాయితేజ చాతిలో నొప్పివస్తోందని చెప్పి అకస్మాత్తుగా కిందపడిపోయాడు. గమనించిన గని అధికారులు వెంటనే సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎలాంటి ప్రాణాపాయం లేదని, స్వల్ప అస్వస్థతకు గురయ్యాడన్నారు.

### హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

- తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ నర్సాగౌడ్


మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): హక్కుల సాధన కోసం గౌడ కులస్తులందరూ ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 40లక్షల పైచిలుకు జనాభా ఉన్న గౌడ కులస్తులు కల్లుగీత వృత్తి రక్షణ, హక్కుల సాధన కోసం, రాజ్యాధికారంలో వాటా కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన, రాజ్యాధికారం సాకారం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గౌడ కులస్తులను అన్నిరంగాల్లో అణిచివేస్తోందన్నారు. కాగజ్‌నగర్‌లోని పటేల్‌గార్డెన్‌లో మార్చి 5న నిర్వహించనున్న జిల్లా మోకుదెబ్బ రెండో గౌడ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మోకుదెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ధి రాములుగౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులు గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, కదిరే ఆంజనేయులుగౌడ్, మచ్చిమడ్ల స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్

జైపూర్: రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామారావుపేట ఉప సర్పంచ్ తంగేళ్లపెల్లి వెంకటేశ్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో సోమవారం సంఘం జిల్లా మూడో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను నియమించినట్లు ప్రకటించారు.

### అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామానికి చెందిన అదృశ్యమైన యువతి ఆచూకీ లభించింది. కాగజ్‌నగర్ పట్టణంలో పోలీసులు యువతితో పాటు మరికొందరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు. యువతిని వేరే రాష్ట్రానికి తరలించి వ్యభిచార కూపంలోకి దింపేందుకు యత్నించి ఉంటారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఐదుగురు, మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన మరో యువకునితో పాటు వీరికి సహకరించిన ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ఆరా తీస్తున్నారు. కొత్తసారసాల గ్రామానికి చెందిన మరో యువకుని కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ ప్రధాన సూత్రదారిగా ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయమై సీఐ నాగరాజును సంప్రదించగా యువతి అదృశ్యం కేసులో కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

### కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


బహుమతి అందిస్తున్న కరాటే మాస్టర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి టీసీఓఏ క్లబ్‌లో నిర్వహించిన ఫస్ట్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. పదేళ్ల లోపు విభాగంలో వి.శ్రీహిత, విజ్జగిరి కీర్తిక, కొట్టే సహస్ర, భువన్ తేజ్, సహస్ర తన్వీ, అర్చన, సుస్మిత, సాహితి, అభిరూప్, యోగితశ్రీ, ఆర్యన్, హరిచందన, సాత్విక్, మణిచందన్, అభిరానందన్, భవిగ్న విజేతలుగా నిలిచారు. బ్లాక్‌బెల్ట్ విభాగంలో శ్లోక ప్రథమ బహుమతి, సంజీవ్ బ్రౌన్‌బెల్ట్, హర్షిక బ్లాక్ బెల్ట్ సాధించారు.

### ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాలోని ఆదివాసీ బిరుదుగోండ్ (తోటి)లకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం కళను నమ్ముకుని జీవిస్తున్న తమకు ప్రభుత్వ పథకాలు అందడంలేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వల్క చిలుకయ్య, ప్రధాన కార్యదర్శి కుర్సింగ వెంకటేశ్ పాల్గొన్నారు.